# తలతన్నే వాడిని తాడి తన్నేవాడు

- ఎం.డి. సౌజన్య



యస్. ఐ యస్వంతరావుకు చాలా మంచి పేరుంది క్రైమ్ డిటెక్ట్ చేయటంలో, అనుమానితుల్ని వలవేసి పట్టటంలో, నేరస్తులతో వాళ్ళు చేసిన నేరాలు అంగీకరింప చేయటంలో — అలా వాళ్ళు ఆ నేరాలు చేసి సంపాదించిన డబ్బులు — వస్తు సామాగ్రి ఎక్కడెక్కడ దాచిందీ కూపీలు లాగడంలో — అతనికతనే సాటి

యస్ ఐ యస్వంతరావు ఒక్కోసారి అవలంబించే తెలివైన పద్ధతులే అతన్ని మరింత ప్రఖ్యాతుణ్ని చేశాయి ! అయితే తాడితన్నేవాణ్ణి తలతన్నేవాడు వుంటాడు కదా ! ?

యస్వంతరావు యస్ ఐ గా మంగళాపురం పోలీస్ స్టేషన్ చార్జి తీసుకోగానే ప్రకాష్ అనే దొంగమీద ఫిర్యాదుల ఫైలు చూసి విస్తుపోయాడు

ప్రకాష్ చదువుకున్నవాడేకాక, పూర్వాశ్రమంలో నాటకాల్లో నటించే నటుడు, పైగా కొన్నాళ్ళు గడియారాలు, రేడియోలు, టేప్ రికార్డర్లు, ఫాన్లు కూడా మెకానిజం చేసిన ఘటికుడు

అతను ఏ సుముహూర్తాన దొంగతనం మొదలుపెట్టాడో — కేవలం పై వస్తువులు తెలివిగా కాజేయటమేకాక, వాటి రూపురేఖలు లోపలి భాగాలూ గుర్తుపట్టటానికి వీల్లేకుండా మార్చివేసి — మసిపూసి మారేడుకాయ చేసి — ఎవరికీ అనుమానం రాకుండా అమ్మివేసేవాడు

పైగా తన నేరం సాక్ష్యాలు లభించకుండా జాగర్తపడేవాడు అందుకే ప్రకాష్ అన్నాళ్ళు దొంగతనాలు చేస్తున్నా సరైన సాక్ష్యాధారాలు లేక కొన్నిసార్లు, పోయిన వస్తువులు సరిగా లభించక కొన్నిసార్లు అతను చేసిన దొంగతనాలు రుజువయ్యేవికావు

యస్వంతరావు మంగళాపురంలోకి రాగానే ఆలస్యం చేయకుండా ప్రకాష్ సంగతి తేల్చాలని నిర్ణయించుకున్నాడు

దీనికి నాందిగా ప్రకాష్‌కు సంబంధించిన భోగట్టా యావత్తూ రహస్యంగా సేకరించి రంగం సిద్ధం చేసుకున్నాడు

వృద్ధురాలైన ప్రకాష్ తల్లి ఆ ప్రక్కనే ఉన్న పల్లెటూళ్ళో వంటరిగా గుండె జబ్బుతో ఉందని, ఆమె ప్రకాష్ కోసం ఎంతో ఆతురతగా ఎదురుచూస్తున్నదని తెలుసుకున్నాడు

యస్వంతరావు ఆలస్యంచేయకుండా ఒక మంచి లేడీ డాక్టరును నర్సుగా వేషంవేయించి తను డాక్టరుగా మారువేషం వేసుకుని ప్రకాష్ తల్లి దగ్గరకు చేరి తమను ప్రకాష్ పంపినట్లు చెప్పాడు

ఆ ముసలమ్మ తన కోసం తన కొడుకు డాక్టర్‌ను, నర్సునూ పంపినందుకు ఎంతో ఆనందించి, తన రోగం సగం తగ్గినట్టు మంచంలో వుండే సంబరపడిపోయింది

ఇలా రెండు రెండు రోజులు వైద్యం జరిగాక, మూడో రోజు ప్రకాష్ గంగా జలం తెచ్చిన బ్రాహ్మణ పూజారిగా నుదుట విభూతి రేఖలతో, తెల్లటి అంగవస్త్రం పైపంచెతో ప్రత్యక్షమయ్యాడు

ఇలా తల్లికోసం మారువేషంలో ఎప్పుడైనా ప్రకాష్ రావచ్చని ఊహించిన యస్వంతరావు, అతని తల్లికి పెథిడిన్ మత్తు మందు నర్సు చేత యిప్పించి ఆ ముసలమ్మను స్పృహలో లేకుండా ఉంచాడు

"ఎవరు మీరు ? ఈ ముసలమ్మకు వైద్యం చేయమని ఎవరు పంపారు ?" అన్నాడు ప్రకాష్ డాక్టర్, నర్సులతో

"మేము ఈ పల్లె ప్రాంతాల్లో ప్రాక్టీసు పెట్టాలని వచ్చాం ! అదృష్ట వశాత్తు ఈ ఇంట్లో ఉన్న ఈ ముసలమ్మ జబ్బుగా ఉందని ఊళ్ళోవాళ్ళు చెబితే మా క్లినిక్ ఇక్కడే ప్రారంభించాము !" అన్నాడు యస్వంతరావు చేతిలో ఉన్న స్టెతస్కోప్, మెడలోవేసుకుంటూ

తన తల్లికి అలాగిన్నా కాస్త మంచి వైద్యం దొరికినందుకు ప్రకాష్ లో లో పల సంతోషించి, తనెవరో వాళ్ళకు తెలియనందుకు సంతోషిస్తుండగా "మీరెవరో మాకు తెలియదు! కాని ఈ ముసలమ్మ బ్రతకాలంటే ఈ మందులు

కొన్ని అర్జెంటుగా తేవాలి! కాస్త ఖరీదైన మందులు—అయినా గుండె జబ్బు తగ్గటానికి—తప్పదు!'' అన్నాడు ఓ మందుల చీటీ ఇస్తూ. ప్రకాష్ అలా మందుల చీటీతో మందులషాపు దగ్గర ఆ చీటీ చూపగానే, మందుల దుకాణాల్లో మఫ్టీలోవున్న పోలీసులు అతన్ని వెంటనే అరెస్టు చేశారు

తనను అంత తెలివిగా అరెస్టు చేసిన యస్ ఐ యస్వంతరావు ఎత్తుగడకు ఆశ్చర్యపోతూ లాకప్‌లోకి వెళుతున్న ప్రకాష్‌తో 'డియర్ ఫ్రెండ్ ప్రకాష్! మీ అమ్మకు అంత సీరియస్‌గా ఏంలేదు! కేవలం నిన్ను అరెస్టు చేయటానికి అలా పథకం వేశాను మీ అమ్మ క్షేమంగా ఉంది నాతో నర్సుగా నటించిన లేడీ డాక్టర్ ఆమెను ట్రీట్ చేస్తోంది! ఆమె క్షేమముగా ఉంది! బైది బై — నీకో రెండు రోజుల టైం ఇస్తున్నాను! నువ్వు చేసిన దొంగతనాలు — ఇవి ఎలా ఎవరిద్వారా అమ్ముతున్నావో — ఎవరు మధ్యవర్తులుగా ఉండి నీతో సహకరిస్తున్నారో ఆ వివరాలు కావాలి! ఆలస్యంచేస్తే నీవంటి వాళ్ళచేత నిజం ఎలా కక్కించాలో నాకు బాగా తెలుసు?'' అన్నాడు.

ప్రకాష్ ఏం మాట్లాడలేదు! నిశ్శబ్దంగా లాకప్‌లోకి వెళ్ళిపోయాడు.

రెండు రోజులు అన్నం నీళ్ళు లేకుండా మాడబెట్టినా ప్రకాష్ లొంగకపోవటం యస్వంతరావుకు ఆశ్చర్యం కలిగించింది. పోలీసు లాఠీ దెబ్బలు ఏం పనిచేయలేదు. మరో రెండు రోజులు గడిచాయి. అయినా ప్రకాష్‌లో మార్పు రాలేదు. మనిషి నీరసించి, మొహం పీక్కుపోయినా మొండి ధైర్యంతో నిమ్మకు నీరెత్తినట్లు అట్లాగే వున్నాడు.

ఈలోపు ప్రకాష్‌కు ఓ గరల్ ఫ్రెండ్ ఉందని, ఆమె పేరు 'రాణి' అని తెలిసి, ఆమెనే రాత్రి హాస్యంగా స్టేషనుకు పిలిపించాడు.

మంచిగా రాణికి చెప్పవలసింది చెప్పి ఆమెను ప్రకాష్‌ఉన్న లాకప్ గదిలోకి పంపుతూ ''నువ్వయినా ప్రకాష్‌తో రహస్యాలు చెప్పిస్తే... అతనికి తక్కువ శిక్ష పడే ఏర్పాట్లు చేయిస్తాను! లేదా... అతనిమీద లేనిపోని దొంగతనాలేకాకుండా మర్డరు కేసులో పెట్టవలసి వస్తుంది! జాగర్త!'' అంటూ హెచ్చరించి మరీ చెప్పాడు.

రాణి నోరెత్తకుండా యస్. ఐ. చెప్పింది వింది. ఆమెను ప్రసన్నం చేసుకోడానికి యస్.ఐ. నాలుగు కప్పుల బోర్న్‌విటాకూడా తేవటానికి ఆర్డరిచ్చి ప్రకాష్‌ను లాకప్‌నుంచి బయటికి తెప్పించాడు.

''మీరిద్దరూ ప్రేమికులట కదా! మీకు ఓ అరగంట టైమిస్తున్నాను! ఇప్పుడు టైం పదిన్నర అయింది గడియారం పదకొండు గంటలు కొట్టేప్పటికి మీరిద్దరూ మాట్లాడుకోవటం పూర్తికావాలి! సరిగా పదకొండింటి వరకు నేను అక్కడ గదిలో వేచివుంటాను! మీకు ఏ సెంట్రీలూ కాపలా వుండరు మీరిద్దరే ఏకాంతంలో ఉన్నట్టు మాట్లాడుకోండి! ఓ కే'' అంటూ అక్కడినుంచి నిష్క్రమించాడు

ప్రకాష్‌ను ఆ పరిస్థితిలో చూసిన రాణి భోరుమని కావలించుకొని విలపించింది ఇంతలో నాలుగు కప్పుల బోర్న్‌విటా హెడ్‌కాన్‌స్టేబుల్ తెచ్చాడు

అది అతను బల్లమీద పెట్టగానే 'ఇక్కడ బాత్‌రూమ్ ఎటు?' అంటూ సంజ్ఞలతో చేతి వేళ్ళు చూపుతూ అడిగింది రాణి హెడ్ ఆమెను ఓ వైపు చూపెడుతూ ముందుకు నడవగానే ఆమె అతని వెంట వెళ్ళింది

ఈలోపు రాణి అందించిన మత్తుమందు రెండు కప్పుల్లోపోసి ప్రకాష్ ఏమీ ఎరగనట్టు కూర్చున్నాడు

కాస్సేపటికి రాణి హెడ్‌తో తిరిగి వచ్చి కూర్చుంది. ఒక కప్పు హెడ్‌కు, మరోటి ఎస్.ఐ. యస్వంతరావుకు ఉద్దేశించి ఇచ్చి—యస్.ఐ.గారికి ముందు 'ఆ బోరన్‌విటా కప్పు ఇవ్వమంది. హెడ్ ఆమె మాట వెంటనే పాటించాడు.

క్షణాల్లో జరగవలసినదంతా జరిగిపోతోంది. ఏదో సంభాషించుకుంటున్నట్టు కేవలం పెదిమలు కదుపుతూ రాణి—ప్రకాష్‌లు సంభాషించుకోసాగారు

హెడ్ కానిస్టేబుల్ మత్తుగా కుర్చీలో వరిగిపోగానే, అంతవరకు గుండెల్లో దాచుకున్న ఫారిన్ మిని టేప్‌రికార్డర్ రాణి బయటికి తీసి ''యస్ ఐ యస్వంతరావు నాతో అన్న మాటలు అన్నీ ఇందులో రికార్డు చేశాను! అతనన్న మాటలే చాలు నీ నిర్దోషిత్వం రుజువు చేయటానికి!'' అంది

మరు నిముషంలో యస్ ఐ దుస్తులతను ధరించి, తన దుస్తులు యస్ ఐ కి తొడిగి ప్రకాష్—సురక్షితంగా రాణితో బయటపడ్డాడు

తరువాత జరిగింది తెలిసిన యస్ ఐ కిమ్మనకుండా నోరుమూసుకోవాల్సి వచ్చింది కారణం—ప్రకాష్ చేత అంత ఘోరంగా తను అవమానింపబడ్డట్టు లోకానికి తెలిస్తే — ముఖ్యంగా తన పరువు—డిపార్ట్‌మెంట్‌లో తనకు అంతవరకున్న పేరు ప్రతిష్ఠలు హరించుకుపోతాయి పైగా అది ప్రమోషన్‌కి అడ్డం వస్తుంది

రెండవది—తను రాణిని బెదిరిస్తూ అన్న మాటలు రహస్యంగా రాణి టేప్ రికార్డు చేసిన విషయం.

ఇప్పటికీ యస్వంతరావుకు యస్. ఐ. గా మంచి పేరే వుంది!

ఎంత తల తన్నేవాడికైనా—తాడి తన్నేవాడు ఎవడో ఒకడు తగలకపోడు గదా! ★

'సంక్రాంతి సంబరం' (ఫోటో : దుర్గాసి సాయిబాబు)

